సాక్షి నంద్యాల

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



అలరించిన పౌరాణిక నాటకం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై గుంటూరు జిల్లాకు చెందిన కాశీనాగ విశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ వారిచే ప్రదర్శించిన శ్రీకృష్ణరాయ బారం పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.



వీధి కుక్కల దాడి..

పత్తికొండ పట్టణంలోని అన్ని కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికం అయ్యింది. వీటి దాడిలో శుక్రవారం 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.90
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79.466
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 44,650
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 36,232

న్యూస్‌రీల్

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల పెంపు



జూపాడుబంగ్లా: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 30 వేల నుంచి 32 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 1,16,422 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో 883.60 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 2, 4, 5, 6,7 గేట్ల అడుగు మేర ఎత్తి 32 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 13 వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్ఎస్ఎస్) కాల్వకు 13 వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 6వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

'ఫారెస్ట్' పోస్టుల భర్తీకి రేపు స్క్రీనింగ్ టెస్ట్

కర్నూలు (సెంట్రల్): ఫారెస్ట్ శాఖలోని అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీపీఎస్సీ నిర్వహించే అటవీ శాఖ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా పరీక్షల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించిన పరీక్షను 3 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, లేదంటే ఏదైనా గుర్తింపు కార్డులను హాల్‌టిక్కెట్‌తో పాటు తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని 15 నిమిషాలకు ముందుగానే సూచించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోరన్నారు.

632 బస్తాల ఎరువులు సీజ్

గడివేముల: మండల కేంద్రం గడివేములలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు చేసి 632 ఎరువుల బస్తాల్ సీజ్ చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడటంతో విజిలెన్స్ సీఐ పవన్ కుమార్, డీసీటీఓ వెంకటరమణ తదితరులు మూడు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ధనలక్ష్మీ ఎరువుల దుకాణంలో యూరియా బస్తా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి 266 బస్తాలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అదే విధంగా వెంకటేశ్వర ట్రేడర్స్‌లో 20.20.0.13 బస్తాలు 220, దుర్గ భవాని దుకాణంలో 146 బస్తాలు సీజ్ చేశామన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులు యూరియాను నిల్వ ఉంచి అధిక ధరలకు అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాపారులు కృత్రిమ కొరత సష్టించి యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆ గట్టు పరవశించి.. ఈ గట్టు నీరసించి!

కనుచూపు మేర పచ్చని నల్లమల కనుమలు.. ఆ మధ్యలో ఒంపులు తిరుగుతూ ముందుకు ప్రవహించే కృష్ణానది. ఆ అందాలను ఒడిసిపట్టిన శ్రీశైలంప్రాజెక్టు.. వీటన్నింటినీ ఒక చోటు నుంచి వీక్షిస్తే.. మది పులికించి పోతుంది. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న శ్రీశైల ప్రాంతం పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో అనువుగా ఉంది. ఆ గట్టున తెలంగాణ ప్రభుత్వం టూరిజాన్ని పరుగులు పెట్టిస్తుండగా.. ఈ గట్టున ఏపీ ప్రభుత్వం కనీసం ఆ ఆలోచన కూడా చేయడం లేదు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ఎన్నో అవకాశాలు ఉన్నా పట్టించుకోవడం లేదు.



తెలంగాణ వైపు ప్రకృతి అందాల నడుమ హిల్ టాప్ విల్లాలు

- శ్రీశైలం సమీపంలో విడిది విల్లాలు ఏర్పాటు చేసిన తెలంగాణ
- నల్లమల కొండల మధ్యలో నిర్మాణం
- ఆసక్తి చూపుతున్న పర్యాటకులు
- మరో వైపు నాగార్జునసాగర్, సోమశిల నుంచి బోటు ప్రయాణం
- పర్యాటకం అభివృద్ధిపై దృష్టి సారించని ఏపీ పర్యాటక శాఖ
- శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాల్లో కోకొల్లలుగా 'హిల్ వ్యూ' ప్రదేశాలు
- నిలిచిన హెలీ టూరిజం ప్రారంభమెప్పుడో..

శ్రీశైలంటెంపుల్: దట్టమైన నల్లమల మధ్యలో ఉన్న శ్రీగిరి సందర్శనకు శివభక్తులు, యాత్రికులు, ప్రకృతి ప్రేమికులు దేశం నలుమూలల నుంచి నిత్యం వస్తూనే ఉంటారు. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలసి వెలసిన పుణ్యక్షేత్రమైన శ్రీశైలం. ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. క్షేత్రానికి విచ్చేసిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలను తిలకిస్తూ పర్యాటక అనుభూతిని పొందుతున్నారు. టూరిజంగా అభివృద్ధి చెందేందుకు శ్రీశైలం ప్రాంతంలో అనేక అవకాశాలు ఉన్నా కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. శ్రీశైలంలో లోకల్ జాయ్ ట్రిప్ బోటింగ్, అక్కమహాదేవి గుహలకు బోటింగ్ మాత్రమే ఉన్నాయి. గతంలో 2016లో హెలిటూరిజం పేరుతో హెలికాప్టర్ ప్రయాణం ప్రారంభించినప్పటికీ అది అర్ధంతరంగా నిలిచిపోయింది. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం టూరిజం అభివృద్ధిలో దూసుకుపోతోంది.



ఆ వైపు పడవెళ్లిపోతుంది..

తెలంగాణ రాష్ట్రం పర్యాటక అభివృద్ధిలో భాగంగా పడవ ప్రయాణం కూడా అందుబాటులోకి తెచ్చింది. నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం బోటు షికార్‌ను ఎప్పుడో ప్రారంభించింది. అంతేకాకుండా సోమశిల నుంచి పాతాళగంగకు కృష్ణానదిపై బోటులో ప్రయాణిస్తూ నల్లమల అందాలను ఆస్వాదించవచ్చు. అక్కడ రిసార్ట్స్ ఏర్పాటు చేసి పర్యాటకులు బస చేసే అవకాశం కల్పించింది. ఈ గట్టున సంగమేశ్వరం కూడా ఇందుకు అనువుగా ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో హడావుడి చేసి చేతులెత్తేసింది. సంగమేశ్వర క్షేత్రానికి సమీపంలోనే రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి అమ్మవారు కొలువైన క్షేత్రం కొలను భారతి. ఈ రెండు కేంద్రాలను శ్రీశైలం నుంచి పర్యాటకులు కృష్ణానది మీదుగా ప్రయాణించి దర్శించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఆలోచన చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


హెలిటూరిజం మళ్లీ వచ్చేనా..

శ్రీశైల మహాక్షేత్ర ఖ్యాతి విశ్వవ్యాప్తంగా విస్తరించడంతో వివిధ దేశాల నుంచి భక్తులు శ్రీశైలానికి తరలివస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, ఏవియేషన్ సంయుక్తంగా హెలి టూరిజం ఏర్పాటు చేసింది. 2016, ఆగస్టు 28న హెలి టూరిజంను అప్పటి దేవస్థాన ఈఓ నారాయణ భరత్‌గుప్తా ప్రారంభించారు. సమ్మిట్ ఏవియేషన్ సంస్థ ద్వారా హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి హెలికాప్టర్ సర్వీసును నడిపింది. అలాగే లోకల్‌గా భక్తులు, స్థానికుల సౌకర్యార్థం జాయ్ ట్రిప్‌ను సైతం ఏర్పాటు చేసింది. హెలి టూరిజానికి భక్తుల నుంచి ఆదరణ ఉన్నప్పటికీ అర్ధాంతరంగా నిలిపివేశారు.



యాత్రికులతో శ్రీశైలం చేరుకున్న హెలికాప్టర్ (ఫైల్)

పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు ఆసక్తి ఉన్న పలు సంస్థలకు సైతం లీజు పద్ధతిపై భూములు కేటాయిస్తోంది. పలు సంస్థలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నాయి. టూరిజం అభివృద్ధిలో శ్రీశైల ఆలయానికి 25 కిలోమీటర్ల దూరంలో తెలంగాణ ప్రభుత్వం నల్లమల కొండల్లో విడిది విల్లాలను నిర్మించింది. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో 'హిల్ టాప్' పేరుతో నిర్మించిన ఈ విల్లాలను సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో 20 వసతి గదులు అందుబాటులో ఉన్నాయి. నల్లమల అందాలు, కృష్ణమ్మ నదీ ప్రవాహం, శ్రీశైల ఆలయం దృశ్యాలను వసతి గదిలోనే కూర్చొని వీక్షించే అవకాశం ఉంది. దీంతో హిల్‌టాప్ వసతి గదుల్లో బస చేసేందుకు పర్యాటకులు అధికసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.



పర్యాటకం అభివృద్ధికి మార్గాలెన్నో..

శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాల్లో కోకొల్లలుగా హిల్ వ్యూ ప్రదేశాలు ఉన్నాయి. ఏపీ టూరిజం శాఖ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దైవ దర్శనానికి వచ్చిన పర్యాటకులు రెండు, మూడు రోజులు ఇక్కడే బస చేసి పర్యాటక ప్రాంతాలను తిలకించడంతో టూరిజం అభివృద్ధితో పాటు పాటు స్థానిక యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయి.

➤ శ్రీశైలానికి 17 కిలోమీటర్ల దూరంలోని ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో అసక్తి చూపుతారు. పూర్తిగా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఉండడంతో టూరిజం శాఖ ఆ దిశగా ఆలోచనలు చేసి ఇష్టకామేశ్వరి జంగిల్ సఫారీ ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం నెక్కంటి జంగిల్ సఫారీ పేరుతో ఇష్టకామేశ్వరి దర్శనానికి ప్రైవేట్ జీపుల ద్వారా భక్తులను అనుమతిస్తున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు ఓపెన్ టాప్ జీపులను ఏర్పాటు చేసి అడవిలో సంచరించే జంతువులను పర్యాటకులు వీక్షించేలా ఏర్పాట్లు చేయవచ్చు.

➤ తెలంగాణ ప్రాంతంలోని అమ్రాబాద్ వద్ద ఉన్న అక్టోపస్ వ్యూ పాయింట్ మాదిరిగా శ్రీశైలం సమీప నల్లమల అడవుల్లో ఏర్పాటు చేయవచ్చు. అడవుల్లో పర్యాటకులు ఒకరోజు విడిది చేసేలా టూరిజం శాఖ రిసార్ట్స్ నిర్మించవచ్చు. కాగా ఈ ప్రాంతం టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో అనుమతులకు పాలకులు కృషి చేయాల్సి ఉంది.

➤ నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని సున్నిపెంట బయోడైవర్సిటీ ల్యాబ్, ఎకలాజికల్ పార్క్ అలాగే పర్యావరణ విజ్ఞాన కేంద్రం మూడింటిని కలుపుతూ ఎకో టూరిజంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తెస్తే పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉంది.

శాంతి.. ఐక్యత... భక్తి

ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినం సందర్భంగా మిలాద్ – ఉన్ – నబీ పండుగను శుక్రవారం ముస్లింలు పవిత్రంగా జరుపుకున్నారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థన చేశారు. అన్ని ప్రాంతాల్లో శాంతి, ఐక్యత, భక్తి వెల్లివిరిసింది. జియారత్ – ఏ – ఆసార్ – ఏ – ముబారక్ నిర్వహించారు. నంద్యాల పట్టణంలో మంజుబాషా దర్గా నిర్వాకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

– నంద్యాల(వ్యవసాయం)



డాక్టర్.. ఉద్యోగాల్లేవ్!

- నిష్ప్రయోజనంగా మారిన ఫార్మా–డి కోర్సు
- ఉమ్మడి జిల్లాలో 1400 మందికి పైగా నిరుద్యోగులు



కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఆఫ్ ఫార్మసి (ఫార్మా–డి) కోర్సును పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ కోర్సును 2008లో అప్పటి యుపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కోర్సు చేసిన వారికి డాక్టర్‌తో సమానంగా హోదా లభిస్తుందని చెప్పడంతో అప్పట్లో విద్యార్థులు చాలా మంది ఆసక్తి చూపించారు. కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో రెండు ఫార్మసి కాలేజీల్లో ఒక్కో దాంట్లో 30 సీట్ల చొప్పున కోర్సును ప్రారంభించారు. అప్పట్లో ఎంబీబీఎస్‌లో సీటు రాని వారు డెంటల్ లేదా ఫార్మా–డి కోర్సును ఎంచుకునేవారు.

కొత్త పోస్టులు లేవు

ఎంబీబీఎస్‌తో సమానంగా ఈ కోర్సు ఆరు సంవత్సరాలు(5 ప్లస్ 1 సంవత్సరం ఆసుపత్రిలో ఇంటరిన్షిప్) చదవాల్సి ఉంది. క్లినికల్ ఓరియంటెడ్ ప్రొఫెషనల్ డాక్టోరల్ ప్రోగ్రామ్, హ్యూమన్ అనాటమి అండ్ ఫిజియాలజీ, ఫార్మకాలజి మొదలైన వాటితో పాఠ్యాంశాలు బోధించారు. ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్ ఆధారంగా రోగులకు హేతుబద్ధమైన డ్రగ్ థెరపిని అందించేందుకు డ్రగ్ జ్ఞానాన్ని వర్తింపజేసేందుకు సహాయపడుతుంది. క్లినికల్ ఫార్మాసిస్టుల పాత్ర అభివృద్ధి చెందిన దేశాల్లో బాగా గుర్తించారు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఈ కోర్సును ఆమోదించింది. ఒక విధంగా చెప్పాలంటే పేరు ముందు డాక్టర్ అని రాసుకోవచ్చని అప్పట్లో విద్యార్థులను ఊరించారు. ఈ కోర్సు చదివిన వారికి ఫార్మా కంపెనీల్లో రీసెర్చ్ విభాగంలో ఉద్యోగంలో చేరవచ్చని చెప్పారు. అయితే వీరిని ఉపయోగించేందుకు కొత్త పోస్టులు సృష్టించలేదు.

చెల్లని చెక్కులా మారిన ఫార్మా–డి పట్టా

కళాశాలల్లో ఆరేళ్ల పాటు ఎంబీబీఎస్‌తో సమానంగా చదివిన ఫార్మ్–డి విద్యార్థులు పట్టా చేతిలో తీసుకుని బయటకు వస్తే వారికి ఎక్కడ చూసినా చీకటే కనిపిస్తోంది. ఈ పట్టాతో ఎవ్వరూ ఉద్యోగం ఇవ్వడం లేదు. ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా వీరి కోసం పోస్టులను సృష్టించలేదు. ప్రైవేటుకు వెళితే మీ కంటే బి.ఫార్మసి వారిని తీసుకుంటే మేలని, వారి కంటే మీది ఉన్నతమైన అర్హత అవుతుందని, మీ లాంటి వారితో పనిచేయించుకోవడం కష్టమని దెప్పి పొడిచారు..ఇంకా పొడుస్తున్నారు. 2013 తర్వాత పట్టా తీసుకుని ఇప్పటి వరకు 1400 మంది దాకా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫార్మ్–డి నిరుద్యోగులు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

ఎక్కువ చదివారని ఉద్యోగం ఇవ్వడం లేదు



ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మేం ఫార్మా–డి కోర్సును పూర్తి చేశాం. ఎంబీబీఎస్‌తో సమానంగా సబ్జెక్టులు చదివి, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి పట్టా తీసుకుని బయటకు వచ్చాం. ఇప్పుడు మాకు ఉద్యోగం ఇచ్చేవారే కరువయ్యారు. బి.ఫార్మసీ అర్హతతో ఉన్న ఉద్యోగాలకు వెళితే మీరు చాలా ఎక్కువ చదివారని, ఈ ఉద్యోగం మీకివ్వలేమని చెబుతున్నారు. మాలాంటి వారి సేవలను ప్రభుత్వం ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ ఎస్. లక్ష్మీకాంత్, ప్రెసిడెంట్ అసోసియేషన్ ఆఫ్ డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, ఏపీ

విలువలతో కూడిన విద్యనందించాలి

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం–2025 కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఈఓ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముఖ్య అతిథులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు.

బాలరాజు మాస్టార్ ఎప్పటికీ మరిచిపోను..

జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపాలనాన్నారు. మొదటి పోస్టింగ్ విజయనగరం జిల్లాలో చేసినప్పుడు ఆఫీస్ ముందు ఒక పెద్ద హోర్డింగ్ పెట్టి అందులో విద్యాభివృద్ధికి సంబంధించిన మంచి మంచి సూక్తులు రాయించడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మారుమూల గ్రామంలో 35 ఇల్లు ఉన్న ఒక పల్లె నుంచి వచ్చి ఈరోజు కలెక్టరుగా అందరి ముందు మాట్లాడుతున్నాను అంటే తల్లిదండ్రులు వారు పెంచిన విధానం వారు నేర్పిన విలువలు నాకు అక్షరాభ్యాసం చేసిన బాలరాజు మాస్టారే కారణమన్నారు. అన్నపూర్ణ లెక్కల టీచర్‌కి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం...

జిల్లా వ్యాప్తంగా 48 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమా రి సత్కరించి, జ్ఞాపికా ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వినాయక చవితిని పురస్కరించుకుని గత నెల 27వ తేదీన ప్రారంభమైన గణపతి నవరాత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో భాగంగా రత్నగర్భ గణపతి, సాక్షిగణపతి, యాగశాలలో నెలకొల్పిన పంచలోహ వరసిద్ధి వినాయక స్వామికి, సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతికి వ్రతకల్పపూర్వక పూజలు చేపట్టరు. గణపతి, జయాది హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు పలు సుగంధద్రవ్యాలు హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. అనంతరం అవబృధంలో వరసిద్ధి వినాయకస్వామి పంచలోహ మూర్తికి ఆలయ ప్రాంగణంలోని మల్లికాగుండంలో వైదిక శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతిని శుక్రవారం సాయంత్రం నిమజ్జనం చేశారు.



పంచలోహ వరసిద్ధి వినాయకస్వామికి విశేషపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు



కోడుమూరు రూరల్: ఆర్టీసీ బస్సు గేర్ రాడ్ విరిగిపోవడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కోడుమూరు నుంచి వెల్దుర్తికి 21 మంది ప్రయాణికులతో డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం బయలుదేరింది. అయితే వెంకటగిరి గ్రామం దాటిన తర్వాత అనుగొండ రోడ్డులో బస్సుకు సంబంధించిన గేర్ రాడ్ ఒక్కసారిగా విరిగిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదం నుంచి బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులందరు క్షేమంగా బయటపడ్డారు.

13న నర్సెస్ అసోసియేషన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు లీలావతి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదిన నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఎం. లీలావతి చెప్పారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి సి.బంగారి, ట్రెజరర్ కె.లక్ష్మీనరసమ్మలతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ సర్వసభ్య సమావేశం ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ, జనరల్ సెక్రటరి ఎస్. కోటమ్మ హాజరవుతారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని సభ్యులందరూ తప్పకుండా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నేటి (శనివారం) నుంచి 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 79 మంది ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. శుక్రవారం ఆయన మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లెలను బాగు చేయాలన్న ఉద్దేశంతో పల్లెకు పోదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రతి మండలంలో 3 గ్రామాలు చొప్పున 79 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందుకోసం 79 మంది అధికారులను నియమించినట్లు చెప్పారు. వారు ఏ గ్రామాలకు వెళ్లాలనే విషయాన్ని వారికి తెలిపినట్లు చెప్పారు. వీరంతా శనివారం ఉదయం 9 గంటలకు నిర్దేశించిన గ్రామానికి చేరుకొని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్పిటళ్లు, హాస్టల్ తదితర ప్రభుత్వ సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలన చేస్తారు. తాగునీటి సరఫరా, వైద్య సేవలు, ఇళ్ల నిర్మాణాలు, రోడ్ల సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, పారిశుద్ధ్యం కార్యక్రమాలను పరిశీలిస్తారన్నారు. నిర్దేశించిన గ్రామాలకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ తమ బృందాలతో స్పెషల్ ఆఫీసర్ వెంట వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా సహృదయంతో నిర్వహించాలన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించి ఆయా శాఖలు సమాచారాన్ని 9లోపు పంపాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల ఉసురుకు కూటమి కొట్టుకుపోతుంది!



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా

● టీడీపీ నాయకులకే యూరియా
● ఈ కష్టాలు రైతులకు ఎప్పుడూ రాలేదు

బొమ్మలసత్రం: రైతుల ఉసురు పోసుకుని కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో కొట్టుకుపోతుందని ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా విమర్శించారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ పనులు చేసుకోనివ్వకుండా కూటమి ప్రభుత్వం యూరియా కోసం రోడ్డెక్కేలా చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టాల్లో ఉన్న రైతులను పరామర్శించేందుకు వెళ్తే రైతులపై కేసులు పెట్టి కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రానికి అరకొరగా వచ్చిన యూరియాను సీఎం చంద్రబాబు ఇచ్చిన దోచుకో.. దాచుకో.. పిలుపు మేరకూ టీడీపీ నాయకులు యూరియాను దోచుకోవడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ నెలలో 1.55 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి అవసరం కాగా 94 వేల టన్నులు మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. తక్కువ నిల్వలను కూడా కావాల్సిన వారికి ఇచ్చుకుంటున్నారని విమర్శించారు. మినుములు ప్రభుత్వం రూ.8 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తుందని చెబుతున్నా రూ. 4 వేలు మాత్రమే లభిస్తుందన్నారు. రైతుల సమస్యల పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకూ జిల్లా కలెక్టర్‌కు ఈనెల 9న వినతి పత్రం అందిస్తున్నామన్నారు.

గత ప్రభుత్వంలో పుష్కలంగా యూరియా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు యూరియా పుష్కలంగా లభించేదని పీఏసీఎస్ మాజీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి గుర్తుచేశారు. కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులు సాగునీటి, ఎరువుల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూరియా సరఫరాలో విఫలమైన చంద్రబాబు.. యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. సకాలంలో పంటలకు యూరియా వేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు పురుషోత్తంరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్‌మిల్ అమీర్, సెక్రెటరీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, కౌన్సిలర్ ఆరిఫ్‌నాయక్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ శవమై తేలి..

● అనుమానం వ్యక్తం చేస్తున్న బంధువులు



మృతి చెందిన మైథిలీ (ఫైల్)

పాములపాడు/కర్నూలు(రూరల్): ఐదు రోజుల క్రితం అదృశ్యమైన కర్నూలు మండలం పూడూరు గ్రామానికి చెందిన మైథిలీ (24) శుక్రవారం బానకచెర్ల గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ పవర్‌హౌస్ వద్ద శవమై కనిపించింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం మైథిలీకి వివాహం కాగా.. ఏడాది క్రితం భర్తతో విడిపోయి పుట్టింటికి చేరింది. కర్నూలు నగరంలో ఓ కర్రీ పాయింట్‌లో రొట్టెలు చేస్తూ జీవనం సాగిస్తోంది. అక్కడే ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. కాగా గత నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో పూడూరు గ్రామంలో కేసీ కెనాల్ వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె సోదరి భారతి కేసీ కెనాల్ వద్దకు వెళ్లి చూడా మైథిలీ కనిపించ లేదు. అక్కడ మెట్ల వద్ద కేవలం ఒక డబ్బా మాత్రమే కనిపించింది. ఆ సమయంలో కొందరు వ్యక్తులు మద్యం సేవించి అటుగా వెళ్లినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా మైథిలీ మొబైల్ అదృశ్యమైన రెండు రోజులకు ఒక వ్యక్తికి ఆమె ఫోన్ దొరకగా మరో వ్యక్తి ద్వారా కుటుంబ సభ్యులకు పంపించారు. మొబైల్లో సిమ్ కార్డు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 1వ తేదీన మైథిలీ తండ్రి బోరెల్లి ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం బానకచెర్ల గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ పవర్‌హౌస్ వద్ద శవమై కనిపించింది. మృతదేహం బాగా ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా మారడంతో ఆమె ధరించిన దస్తులను బట్టి కుటుంబీకులు మైథిలీగా గుర్తించారు. సమాచారం అందుకున్న కర్నూలు తాలుకా పోలీసు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గ్రామానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది.

రక్త పరీక్షలు చేయించండి



ఆసుపత్రి సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా: జ్వరాల బారిన పడిన వారికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను గురించి డాక్టర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలు వ్యాపించకుండా నిరంతరం ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించాలన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం సమీపంలోని కస్తూర్బా పాఠశాలను పరిశీలించి అందులోని విద్యార్థుల ఆరోగ్యస్థితిగతులపై ఆరా తీశారు. ఎవ్వరికైనా జ్వరం, వాంతులు, విరేచనాలు, దగ్గు, జలుబు, జ్వరం, డెంగూ, మలేరియా వంటి జ్వరాలు వ్యాపించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈయన వెంట హెల్త్‌సూపర్‌వైజర్లు విజయలక్ష్మమ్మ, రాముడు, ల్యాబ్‌అసిస్టెంటు చెంచన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా సంతకాల సేకరణ



జెడ్పీలో సంతకాలు సేకరిస్తున్న సమితి నేతలు

కర్నూలు(అర్బన్): కర్నూలు జిల్లాకు స్వర్గీయ దామోదరం సంజీవయ్య పేరును పెట్టాలని చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతోందని జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పర్వదినంతో పాటు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరుగుతున్న నేపథ్యంలో రాజ్‌విహార్, జిల్లా పరిషత్ ప్రాంగణంలో ముస్లింలు, వివిధ రాజకీయ, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాధన సమితి ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.జయరాజ్ ఉద్యమానికి మద్దతు తెలియజేశారు.

నిమజ్జనంలో అపశ్రుతులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో గురు, శుక్రవారాల్లో జరిగిన వినాయక నిమజ్జనంలో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. వివిధ కారణాలతో అస్వస్థతకు గురై 47 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఇందులో బైక్ ప్రమాదాలు, వివిధ రకాల రోడ్డు ప్రమాదాలు, తోపులాటలో కింద పడటం, వాహనాలపై నుంచి పొరపాటుగా కిందపడటం, ఘర్షణల్లో గాయపడటం వంటివి ఉన్నాయి. వీరంతా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీకి వచ్చి చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనలు జరిగి అధిక సంఖ్యలో క్షతగాత్రులు వస్తారన్న ఉద్దేశంతో ఆసుపత్రి అధికారులు ఎక్కువ మంది వైద్యులు, సిబ్బందిని క్యాజువాలిటీలో ఉంచారు. ఈ మేరకు వచ్చిన వారికి వచ్చినట్లు ప్రథమ చికిత్స అందించి పంపించారు. ఒకరు కత్తిపోట్లకు గురికావడంతో అత్యవసరంగా ఆపరేషన్ నిర్వహించారు.



యాళ్లూరులో క్యూలో ఉన్న రైతులు

ఊరించి.. ఉసూరుమనిపించి!

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. జిల్లాకు యూరియా చేరింది.. శుక్రవారం పంపిణీ చేస్తామని అధికారుల ప్రకటనతో రైతులు ఆర్ఎస్‌కే, సహకార కేంద్రాల వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాశారు. అయితే అరకొర కేటాయింపులతో కొన్ని చోట్ల ఒకటి, రెండు బస్తాలతో సరిపెట్టారు. పలు చోట్ల సాయంత్రం పొద్దు పోయిన తర్వాత పంపిణీ చేయాల్సి వచ్చింది. ఇంకెన్నాళ్లు యూరియా కష్టాలు అంటూ కూటమి ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు. రైతులంటే ఇంత అలుసా.. పుష్కలంగా ఎరువులు ఉన్నాయంటూనే అరకొరగా ఇస్తే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



యూరియా కోసం వెలుగోడు రైతు సేవా కేంద్రానికి వచ్చిన రైతులు

ఓటీపీ జాప్యం.. అంతా గందరగోళం

వెలుగోడు: ఓటీపీ ద్వారా యూరియా పంపిణీ చేపట్టడంతో రైతులు గందరగోళానికి గురయ్యారు. గంటల తరబడి లైన్‌లో నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతుల భూమి డాక్యుమెంట్స్ ఆధార్ లింక్, సెల్ నెంబర్ లింక్ లేకపోవడంతో ఓటీపీ మరింత ఆలస్యం అవుతుంది. మరికొందరి రైతులకు భూమి పత్రాలు ఆన్‌లైన్‌లో లేకపోవడం వల్ల ఓటీపీ రావడం లేదు. ఇలాంటి రైతులకు యూరియా ఇవ్వడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓటీపీ ఆలస్యమవుతుండటంతో వ్యవసాయ శాఖ అధికారులు టోకన్లు జారీ చేసి ఒక్కో పాస్‌బుక్‌కు రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు.కౌలు రైతులకు, సెల్ నెంబర్ లింక్ లేనివారికి, డాక్యుమెంట్స్ సరిగా లేని రైతులకు మాత్రం యూరియా దక్కేలా లేదు.

ఆరు గ్రామాల్లోనే పంపిణీ..



బండి ఆత్మకూరు ఆర్ఎస్‌కే వద్ద వేచి ఉన్న రైతులు

బండి ఆత్మకూరు: మండలంలో 20 గ్రామపంచాయతీలో 27 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. యూరియా కోసం తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాశారు. అయితే మండలానికి ప్రభుత్వం 156 టన్నుల యూరియా మాత్రమే కేటాయించగా అది కూడా కేవలం బండిఆత్మకూరు, సంత జూటూరు, ఎర్రగుంట్ల, పెద్దదేవలాపురం, భోజనం, సింగవరం రైతు భరోసా కేంద్రాలకు మాత్రమే సరఫరా చేయడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజుల నుంచి ఎదురుచూస్తున్నప్పటికీ ఒక బస్తా కూడా ఇవ్వకపోతే ఎలా అంటూ మండిపడ్డారు. బండిఆత్మకూరులో రైతులు గుమికూడటంతో పోలీసులు వచ్చి రంగ ప్రవేశం చేసి టోకెన్లు ఇచ్చి పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేశారు.

నిరీక్షణ.. బారులుదీరింది!

గోస్పాడు: యాళ్లూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. శుక్రవారం మండలంలోని యాళ్లూరు గ్రామంలో అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. యాళ్లూరుకు 532 యూరియా బ్యాగ్‌లు (24 టన్నులు) మంజూరైంది. ఎకరాకు ఒక బస్తా చొప్పున మూడు బస్తాల వరకు మాత్రమే పరిమితం చేశారు. పది ఎకరాలు ఉన్నా మూడు బస్తాలే పంపిణీ చేశారు.

పోలీసుల బందోబస్తు మధ్య..



గాజులపల్లెలో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

మహానంది: మండలానికి 350 టన్నుల యూరియా అవసరం కేవలం శుక్రవారం 164 టన్నులు మాత్రమే రావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం రైతు సేవా కేంద్రాలకు చేరడంతో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. బుక్కాపురం గ్రామంలో రాత్రి 10 గంటల సమయంలో కూడా ఎరువుల కోసం రైతులు నిరీక్షించాల్సి వచ్చింది.

పంటలెప్పుడు సాగు చేసేది..



పాములపాడు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలో 8 రైతు సేవా కేంద్రాలకు 143.64 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీంతో రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు కేవలం 2 బస్తాలు మాత్రమే ఇస్తుండటంపై పెదవిరుస్తున్నారు. రెండు బస్తాలు ఏ మాత్రం సరిపోతాయని ప్రశ్నిస్తున్నారు. ఎరువుల కోసం రోజూ కార్యాలయాల చుట్టూ తిరిగితే వ్యవసాయం చేసేది ఎప్పుడు అంటూ మండిపడ్డారు.

రెండు బస్తాలు ఇస్తే ఎట్లా



6 ఎకరాలు వరి పంట వేశాను. పైరుకు 2 యూరియా బస్తాలు ఏ మూలకు సరిపోతాయి. కనీసం 10 బస్తాలు ఇస్తే నేను సర్దుకోగలను. ఇదేం ప్రభుత్వమో అర్థం కావడం లేదు. ఎందుకు యూరియా కొరత సృష్టించారు. రైతులకు సరిపడ ఎరువులు ఇవ్వడంలో అభ్యంతరమేమిటో వారికే తెలియాలి. రైతులంటేనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇష్టం ఉండదు. అందుకే ఇలా చేస్తున్నాడు. రైతులను ఇబ్బంది పెడితే వారికి ఒరిగేదేముందో అర్థం కావడం లేదు.

– రాముడు, రైతు మద్దూరు, పాములపాడు మండలం

ఎకరాకు అర బస్తా అయినా ఇస్తే మేలు..



నేను 29 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నాను. యూరియా కోసం రైతు సహకార సొసైటీ, రైతు సేవా కేంద్రాలకు వెళ్తే స్టాక్ లేదంటున్నారు. రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్తే ఒక్కో పుస్తకానికి రెండు బస్తాలు ఇస్తామంటున్నారు. కనీసం ఎకరాకు అర బస్తా ఇచ్చినా సరిపోతుంది.

– బొగ్గుల లక్ష్మన్న, రైతు, వెలుగోడు

మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు



హాస్టల్‌లో భోజనాలను పరిశీలిస్తున్న ప్రసూన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె నగరంలోని రెండు బీసీ కళాశాల బాలికల వసతి గృహాలు, ఒక ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లోని పరిసరాలను పరిశీలించి మరింత శుభ్రంగా ఉంచుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. అలాగే వంట గది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి విద్యార్థుల కోసం వండిన వంటకాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పలు హాస్టళ్లలో మెనూ సక్రమంగా పాటించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. తాను చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ఎక్కడైనా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా వసతి గృహాల్లోని విద్యార్థినులతో హాస్టళ్లలో అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.

సురవరం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

● సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి అర్పించిన వివిధ రాజకీయ పార్టీల నేతలు



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): పేద ప్రజల కోసం జరిగిన అనేక ఉద్యమాలకు సురవరం సుధాకర్‌రెడ్డి నాయకత్వం వహించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలు చేపడతామని వక్తలు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను సీపీఐ జిల్లా అధ్యక్షులు కే గిడ్డయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మాట్లాడుతూ రెండు సార్లు ఎంపీగా విజయం సాధించినా సురవరం నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. ధనిక కుటుంబంలో జన్మించిన సురవరం పేదల పక్షాన నిలిచిన వామపక్ష యోధుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ కొనియాడారు. నేటి తరానికి సురవరం ఎంతో ఆదర్శమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో విద్యార్థి దశ నుంచే సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ బాట పట్టారన్నారు. అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీ రామచంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలోని మొలగవెల్లి గ్రామంలో జరిగిన భూపోరాటంలో 1100 ఎకరాలను పేదలకు పంపిణీ చేయించడంలో సురవరం కీలక పాత్ర పోషించారన్నారు. సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, కే రామాంజనేయులు, ఎస్ మునెప్ప, పీ రామక్రిష్ణారెడ్డి, నాగన్న, సీపీఐ ఎంఎల్ నాయకులు సుంకన్న, బస్తిపాడు రామక్రిష్ణారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రవిగువేరా తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలను వెంటాడి పట్టుకున్న రైతు

ఆత్మకూరురూరల్: మోటార్ల దొంగలను వెంటాడి పట్టుకున్న ఘటన ఆత్మకూరు మండలంలోని సిద్దపల్లె – పెద్దనంతాపురం మధ్య గురువారం రాత్రి జరిగింది. ముష్టపల్లె గ్రామానికి చెందిన కౌలు రైతు శివాజీ నాయక్ సిద్దాపురం చెరువు ఎడమ కాల్వ నీటిపై ఆధారపడి పొలం సాగు చేసుకుంటున్నాడు. పొలంలో మోటార్‌ను తస్కరించి దొంగలు ద్విచక్రవాహనంపై పారిపోతుండగా రైతు శివాజీ నాయక్ తన మోటార్ సైకిల్‌ను అడ్డుగా నిలిపి వారిని పట్టుకున్నారు. దొంగతనానికి పాల్పడింది సిద్దపల్లె గ్రామానికి చెందిన సుబ్బారాయుడు, మధుగా గుర్తించారు. చుట్టు పక్కల రైతులు వీరిద్దరినీ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా మోటార్ల దొంగలపై ఎలాంటి కేసులేకుండా వదలి వేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

13 నుంచి ఎద్దుల బలప్రదర్శన పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు

గోనెగండ్ల: స్థానికంగా వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి ఉత్సవాల సందర్భంగా గోనెగండ్ల ట్రాక్టర్స్ యూనియన్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు ఉసేన్, శివన్న, నూర తెలిపారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో పోటీల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దశమి సందర్భంగా ఈనెల 13 నుంచి 15 తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న నాలుగు పళ్ల విభాగం 14న ఆరు పళ్ల సైజు, 15న న్యూ కేటగిరి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్ 9949151807, 8522014358, 9394959515 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రహంతుల్లా, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో 12 మందికి గాయాలు



గాయాల పాలైన మహిళ

పత్తికొండ: వీధి కుక్కల దాడిలో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన చాకలి అయ్యమ్మ అనే మహిళ పని నిమి త్తం పత్తికొండకు వచ్చారు. ఆమెతోపాటు మరో 11 మంది రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడే ఉన్న వీధి కుక్కలు దాడి చేశాయి. అక్కడ ఉన్న స్థానికులు గమనించి కుక్కలను తరిమారు. గాయపడిన వారిని వైద్య చికిత్సల నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పత్తికొండ పట్టణంలోని అన్ని కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని వాటిని అరికట్టేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.